క్లుప్తంగా

‘ఉపాధి’లో 3,100 మందికి పనులు


అవగాహన కల్పిస్తున్న ఏపీఓ రమేష్‌కుమార్

రాయికోడ్(అందోల్): జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా 3,100 మంది కూలీలకు పనులు కల్పించామని ఏపీఓ రమేష్‌కుమార్ తెలిపారు. మండలంలోని మంగళవారం మాటూర్ గ్రామంలో ఉపాధి పని ప్రాంతాలను సందర్శించి కూలీల వివరాలు సేకరించారు. కూలీల హాజరు నమోదును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్‌కార్డు ఉన్న కుటుంబాలు ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పథకంలో ఉన్న వివిధ రకాల పనులపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధి హామీ సిబ్బంది, కూలీలు ఉన్నారు.

జీతాలు చెల్లించాలని కార్మికుల నిరసన



ఆర్డీఓ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

జహీరాబాద్ టౌన్: పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని మున్సిపల్ వాటర్‌మెన్‌లు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మంగళవారం ఆర్డీఓ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి కె.నర్సింలు మాట్లాడుతూ మూడు నెలల నుంచి జీతాలు రాని కారణంగా కార్మికుల కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. జీతాలు చెల్లించకపోతే విధులు బహిష్కరిస్తామని హెచ్చరించారు. ఈ మేరకు ఆర్డీఓ కార్యాలయం అధికారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రమేశ్, నర్సింలు, సురేశ్ గౌడ్, సిద్ధు, కృష్ణ, సలీమ్ పాల్గొన్నారు.

హాస్టల్ ఉద్యోగాలకు దరఖాస్తులు

రాయికోడ్(అందోల్): రాయికోడ్‌లోని మోడల్ స్కూల్, కళాశాలకు చెందిన హాస్టల్‌లో పోస్టుల భర్తీకి అర్హులైనవారు దరఖాస్తు చేసుకోవాలని కేజీబీవీ ప్రత్యేకాధికారి దీపిక ఒక ప్రకటనలో తెలిపారు. హాస్టల్ కేర్ టేకర్, వాచ్‌మెన్, ముగ్గురు వంట మనుషులు, అటెండర్ పోస్టులు భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు 18 నుంచి 45 ఏళ్ల మధ్య వయసు ఉండాలన్నారు. వివరాలకు రాయికోడ్‌లోని కేజీబీవీలోని కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

విగ్రహాల ఊరేగింపు


విగ్రహాలు ఊరేగిస్తున్న భక్తులు

కంగ్టి(నారాయణఖేడ్): మండలంలోని చాప్టా(కె)లో బీరప్ప మందిరంలో విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. కురుమ సంఘం ఆధ్వర్యంలో విగ్రహాలను ఊరేగించారు. మహిళలు బోనాలు చేశారు. బుధవారం బీరప్ప కల్యాణం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

చెక్కులు పంపిణీ

హత్నూర (సంగారెడ్డి): మండల పరిధిలోని గ్రామాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు మంజూరయ్యాయి. ఈ చెక్కులను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి మంగళవారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కృష్ణ, మాజీ సర్పంచ్ వెంకటేశం పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు ఆర్థిక సాయం



రూ.20 వేల చెక్కు అందజేస్తున్న రోహిత్

జహీరాబాద్: తన పుట్టిన రోజును పురస్కరించుకుని గూనెల్లిస్ ఫౌండేషన్ ప్రతినిధి రోహిత్ ప్రభుత్వ పాఠశాలకు రూ.20వేల ఆర్థిక సాయం అందించారు. మంగళవారం మండలంలోని రంజోల్ గ్రామానికి చెందిన రోహిత్ పాఠశాల అభివృద్ధిలో భాగంగా గేటు నిర్మాణానికి చెక్కును విద్యాశాఖ అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నరేష్‌గౌడ్, నాయకులు విష్ణు, సోహెల్, ప్రేమ్, అభి, ఖదీర్, సిబ్బంది పాల్గొన్నారు.

శిథిలావస్థలో పశు వైద్యశాలలు

ఇబ్బందులు పడుతున్న సిబ్బంది
- వీటికి తోడు వైద్యుల కొరత
- పశువులకు అందని వైద్యం
- పట్టించుకోని అధికారులు

న్యాల్‌కల్(జహీరాబాద్): పశు వైద్యశాలలకు సొంత భవనాలు లేవు. దీనికి తోడు ఉన్న ఒకటి రెండు భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. మంజూరైన భవనాల నిర్మాణ పనులు ఏళ్ల తరబడి నత్తనడకన కొనసాగుతుండటంతో పశువైద్యులు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో వర్షపు నీరు లోనికి వచ్చి మందులన్నీ తడిసిపోతున్నాయని సిబ్బంది చెబుతున్నారు. వీటికి తోడు వైద్యులు, సిబ్బంది కొరత కారణంగా పశువులకు సరైన వైద్యం అందడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

మండలంలోని న్యాల్‌కల్, మిర్జాపూర్(బి)లో పశు వైద్య కేంద్రాలున్నాయి. ఈ రెండింటి పరిధిలో ఉన్న చాల్కి, న్యాల్‌కల్, హద్నూర్, మెటల్‌కుంటలో పశు వైద్య ఉప కేంద్రాల భవనాలు శిథిలాస్థకు చేరుకున్నాయి. చాల్కిలోని పశు వైద్య ఉప కేంద్రం శిథిలావస్థకు చేరుకొని పైకప్పు పెచ్చులూడి పడుతుండటంతో.. గ్రామస్తులు నూతన భవనం మంజూరు చేయాలని అధికారులను కోరారు. 2014లో ప్రభుత్వం నూతన భవన నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేసింది. అప్పట్లో కాంట్రాక్టర్ పనులు ప్రారంభించాడు. పదేళ్లు గడిచినా భవన నిర్మాణం పనులు పూర్తి కాలేదు. దీంతో ఇటు వైద్య సిబ్బంది, అటు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. న్యాల్‌కల్, హద్నూర్‌లో పశు వైద్య కేంద్రాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఈ రెండింటి లోనూ వర్షాకాలంలో వర్షపు నీరు భవనంలోకి వస్తుందని ఫలితంగా మందులు తడిసి పోయి ఇబ్బందులు పడుతున్నామని సిబ్బంది పేర్కొంటున్నారు. మెటల్‌కుంటలో సొంత భవనం లేకపోవడంతో గ్రామ పంచాయతీ భవనంలో ఒక గదిని పశు వైద్య కేంద్రంగా ఉపయోగించుకుంటున్నారు.


చాల్కిలో శిథిలావస్థకు చేరుకున్న పశు వైద్యశాల

సిబ్బంది కొరత

మండలంలో 7,645 పశువులు, 16,172 జీవాలు ఉన్నాయి. వీటికి అనుగుణంగా పశు వైద్యులు, సిబ్బంది లేరు. ఫలితంగా పశువులకు సరైన వైద్యం అందడం లేదని ఆయా గ్రామాల రైతులు, పశు పోషణ దారులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు శిథిలావస్థకు చేరుకున్న భవనాల స్థానంలో నూతన భవనాలను నిర్మించాలని కోరుతున్నారు. అసంపూర్తిగా ఉన్న భవన నిర్మాణ పనులను పూర్తి చేసి వినియోగంలోకి తేవాలని, వైద్యుల కొరత తీర్చాలని అంటున్నారు.


న్యాల్‌కల్ పశువైద్య కేంద్రంలో పైకప్పు పెచ్చులూడుతున్న దృశ్యం


చాల్కిలో అర్ధంతరంగా నిలిచిపోయిన పశు వైద్య భవనం

మాకు స్వాధీనం చేయలేదు



మండలంలో కొన్ని పశువైద్య కేంద్రాల భవనాలు శిథిలాస్థకు చేరుకున్నాయి. చాల్కిలో నిర్మించిన భవనం మాకు స్వాధీనం చేయలేదు. హద్నూర్, మిర్జాపూర్(బి)లో వైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా.

- గణేష్, పశు వైద్యాధికారి, న్యాల్‌కల్

15 నుంచి దుర్గాదేవి జాతర ఉత్సవాలు


ఉత్సవాల నిర్వహణ కోసం సమావేశమైన గ్రామ ముఖ్యులు

జాడీమల్కాపూర్‌లో వారం పాటు ప్రత్యేక కార్యక్రమాలు

జహీరాబాద్: మొగుడంపల్లి మండలంలోని జాడీ మల్కాపూర్ గ్రామంలో గల దుర్గాదేవి ఆలయంలో జాతర మహోత్సవాలు ఈనెల 15 నుంచి 22వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. మంగళవారం ఆలయ ప్రాంగణంలో గ్రామ ప్రముఖులు సమావేశమై ఉత్సవాల ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయంలో దుర్గాదేవికి అలంకరణ చేసి ఉత్సవాలకు ముస్తాబు చేశారు. 15న పీర్లకు, బీరప్ప కార్యక్రమాలు, 16న ఊరడమ్మ, భవానీ మాతలకు బోనాలు, 17న పోచమ్మ, ఈడిగి ఎల్లమ్మలకు బోనాల ఉత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. 18న నాగుల ఎల్లమ్మ, లక్ష్మమ్మలకు భక్తులు మొక్కులు చెల్లిస్తారు. 19న లక్ష్మమ్మకు బోనాలు, గావు రంగం, 20న దుర్గమ్మకు నైవేద్యాల సమర్పణ, 21న దుర్గాదేవికి అభిషేకం, కల్యాణం, మహాబలి కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు. 22న పల్లకీసేవ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.


ఉత్సవాలకు దుర్గాదేవిని అలంకరించిన భక్తులు

గిరిజన పూజారులు దరఖాస్తు చేయండి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్

నారాయణఖేడ్: గిరిజన తండాల్లోని ఆలయాల్లో పూజలు నిర్వహించేందుకు పూజారులు ధూప, దీప నైవేద్య పథకం కోసం దరఖాస్తు చేసుకోవాలని మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ కోరారు. ఖేడ్‌కు మంగళవారం వచ్చిన సందర్భంగా దరఖాస్తులను ఆయన పూజారులకు అందజేసి మాట్లాడారు. ఈ నెల 24లోగా అర్హులైన పూజారులు దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి చేసిన వాటిని నారాయణఖేడ్‌లోని తన కార్యాలయంలో అందించాలన్నారు. పూజారులు రెండు గుడి ఫొటోలు, ఆధార్ కార్డు, బ్యాంకు పుస్తకంతోపాటు ఫారం నం.43తో పాటు దరఖాస్తు నింపి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో దిశ కమిటీ సభ్యులు ప్రకాష్ రాథోడ్, మాజీ జడ్పీటీసీ రాజురాథోడ్, రూప్‌సింగ్, నాయకులు నారాయణ, సురేష్ నాయక్, శేషురావు, మోహన్ పాల్గొన్నారు.

డబుల్‌బెడ్రూం ఇళ్లు కేటాయించాలి

నారాయణఖేడ్: ఖేడ్ శివార్లలో నిర్మించిన డబుల్ బెడ్రూంలను లబ్ధిదారులకు వెంటనే కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అతిమేల మాణిక్ డిమాండ్ చేశారు. మంగళవారం నారాయణఖేడ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ డబుల్ ఇండ్ల నిర్మాణ పనులు పూర్తయినా లబ్ధిదారులకు స్వాధీనం చేయకపోవడంతో నిరుపయోగంగా ఉండి శిథిలావస్థకు చేరుకుంటున్నాయని తెలిపారు. కొన్ని అసంపూర్తి దశలో ఉన్నాయన్నారు. గత ప్రభుత్వం నిర్మించిన ఈ గృహాలను ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తున్న ఇంకా లబ్ధిదారులకు ఇవ్వక పోవడం సరికాదన్నారు. సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు నారాయణ, రమేష్, నర్సింహులు, సంతోష్, ప్రవీణ్, కాన్షీరాం, అరుణ్, గణపతి, రాములు, బాబురావు, మహిపాల్, శ్రీనివాస్ ఉన్నారు.


మాట్లాడుతున్న అతిమేల మాణిక్

అకాల వర్షంతో రైతులకు నష్టం


నేలరాలిన మామిడికాయలతో రైతు శ్రీనివాస్

ఝరాసంగం(జహీరాబాద్): మండలంలో కురిసిన అకాల వర్షానికి మామిడి రైతులు నష్టపోయారు. సోమవారం రాత్రి మండల పరిధిలోని మాచ్నూర్ గ్రామ శివారులో బలమైన గాలులతో వర్షం కురిసింది. దీంతో చేతికొచ్చిన మామిడికాయలు రాలిపోయాయి. పూత తక్కువగా ఉండటం కొంత నష్టమైతే, చేతికొచ్చిన పంట నేలరాలడంతో మరింత నష్టం సంభవించిందని మామిడి రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

పటాన్‌చెరు టౌన్: విద్యారంగం ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి అర్జున్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) పటాన్‌చెరు డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల సమస్యలు పరిష్కరించకుండా, విద్యారంగాన్ని ప్రైవేటు వ్యక్తులకు అప్పజెప్పటంతో విద్య వ్యాపారంగా మారిందన్నారు. విద్యార్థులకు శాస్త్రీయమైన విద్యా విధానం అమలు కోసం దేశవ్యాప్తంగా పోరాటం చేస్తామన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పటాన్‌చెరు డివిజన్ కార్యదర్శి సాక్షి, శివ, వంశీ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అర్జున్

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జహీరాబాద్: జహీరాబాద్ డివిజన్‌లోని పలు మండలాల్లో బుధవారం విద్యుత్ కోత విధిస్తున్నట్లు ట్రాన్స్‌కో డీఈఈ ఎ.లక్ష్మీనారాయణ తెలిపారు. జహీరాబాద్‌లోని 132/33 విద్యుత్ ఉపకేంద్రంలో మరమ్మతులు చేపడుతున్న కారణంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరాను నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. జహీరాబాద్, కోహీర్, ఝరాసంగం, న్యాల్‌కల్, రాయికోడ్ మండలాల్లోని అన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

యువకుడు అదృశ్యం


సందీప్ (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: ఇంటి నుంచి బయటకు వెళ్లి యువకుడు అదృశ్యమైన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పటాన్‌చెరు మండలం ముత్తంగికి చెందిన సందీప్ (21) ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. 10న ఇంట్లో వారికి సమాచారం ఇవ్వకుండా ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వచ్చింది. అదృశ్యమైన సందీప్ కోసం తెలిసిన వారి వద్ద, స్థానికంగా వెతికినా ఆచూకీ లభించలేదు. కుమారుడు అదృశ్యంపై తల్లి సుజాత ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

జీహెచ్ఎంసీ కమిషనర్‌కు వినతి


కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ పుష్ప

రామచంద్రాపురం(పటాన్‌చెరు): జీహెచ్ఎంసీ నూతన కమిషనర్ ఆర్‌వీ కర్ణన్‌ను ఆయన కార్యాలయంలో రామచంద్రాపురం డివిజన్ కార్పొరేటర్ పుష్ప మంగళవారం కలిసి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని సమస్యలను కమిషనర్‌కు వివరించామన్నారు. బస్తీదర్శన్ కార్యక్రమంలో పాల్గొనాలని కోరినట్లు తెలిపారు.

ఫైలేరియా వ్యాధిని నిర్మూలిద్దాం

జిన్నారం (పటాన్‌చెరు): ఫైలేరియా వ్యాధి రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని గుమ్మడిదల మండల వైద్యాధికారి మధుకర్ పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని అన్నారం గ్రామంలో 15న రాత్రి 8 గంటల నుంచి 10 గంటల వరకు నిద్రించే 20 సంవత్సరాల నుంచి ఆపై వయసు గల వ్యక్తుల నుంచి రక్తపూతల నమూనాలను సేకరించనున్నట్లు తెలిపారు. గ్రామస్తులు వైద్య సిబ్బందికి సహకరించాలని సూచించారు.

ఘనంగా రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాలు

జోగిపేట(అందోల్): అందోలులోని శ్రీ భూనీల భవాని సమేత రంగనాథ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. రంగంపేట పీఠాధిపతి శ్రీమాధవానంద స్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ఉపదేశం చేశారు. ఈనెల 13 నుంచి బ్రహ్మోత్సవాలు 19వ తేదీ వరకు జరగనున్నాయి. మొదటి రోజు 1041మందితో హనుమాన్ చాలీసా పారాయణం కార్యక్రమం చేపట్టారు. ఆలయంలో విష్ణుసహస్ర నామ స్తోత్ర పారాయణం, విశ్వక్సేనన ఆరాధన, తదితర పూజా కార్యక్రమాలను ఆలయ పూజారి శ్యామ్‌నాథ్ శర్మ ఆధ్వర్యంలో వేద పండితులు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. బుధవారం ఉదయం ఆలయంలో గరుడ ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సంతానం కోరుకునే భక్తులు ఉదయం 10.30 గంటల వరకు ఆలయానికి సంప్రదాయ వస్త్రాలను ధరించి చేరుకోవాలన్నారు.


హనుమాన్ చాలీసా పారాయణం చేస్తున్న భక్తులు

కేతకీలో ఎమ్మెల్యే పూజలు

ఝరాసంగం(జహీరాబాద్): దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీ కేతకీ సంగమేశ్వర ఆలయంలో బీదర్ ఎమ్మెల్యే డా.శైలేంద్ర బేల్దాలె మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన గర్భగుడిలోని పార్వతీ పరమేశ్వరులకు అభిషేకం, కుంకుమార్చన, మహా మంగళహారతి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు హన్మంత్ రావు పాటిల్, పాలక మండలి చైర్మన్ చంద్ర శేఖర్, నాయకులు మల్లయ్య స్వామి, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.


కేతకీలో పూజలు చేసిన బీదర్ ఎమ్మెల్యే

ఉత్సాహంగా కుస్తీపోటీలు

నారాయణఖేడ్: నిజాంపేట్ మండల కేంద్రంలో దుర్గమ్మ జాతర ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాలను పురస్కరించుకొని మంగళవారం కుస్తీ పోటీలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పోటీలు రసవత్తరంగా సాగాయి. మల్లయోధులు తమ ప్రతిభ కనబర్చారు. మహబూబ్ నగర్ జిల్లా నుంచి వచ్చిన గీత, సంగీత, శిరీష, మహారాష్ట్ర నుంచి వచ్చిన పల్లవి పవార్ అనే బాలికలు పోటీల్లో బాలురతో తలపడి గెలుపొందారు.


కుస్తీపోటీలో బాలునితో తలపడుతున్న బాలిక

సంక్షిప్త వార్తలు

◆ **ముగిసిన వేసవి శిక్షణ శిబిరం**

పుల్‌కల్(అందోల్): కొన్ని రోజులుగా కొనసాగుతున్న వేసవి శిబిరం గురువారం ముగిసింది. మండల పరిధిలోని బస్వాపూర్ మాడల్ పాఠశాలలో గత నెల 25 నుంచి ఈనెల 13 వరకు బాల బాలికలకు వివిధ రకాల ఆటలు, పాటలు కార్యక్రమాలు నిర్వహించారు. చిత్రలేఖనం, ఇండోర్ గేమ్స్ తదితర వ్యక్తిత్వ వికాస కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ శంకర్, ప్రధానోపాధ్యాయులు లక్ష్మీనారాయణ, సీఆర్‌పీలు ప్రభాకర్, మల్లేశం, పీఈటీ సురేష్ పాల్గొన్నారు.

వట్‌పల్లి మండలంలో..

వట్‌పల్లి(అందోల్): మండలంలోని మర్వెళ్లి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన తెలంగాణ రైజింగ్ ఉచిత వేసవి శిక్షణ శిబిరం మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా వివిధ అంశాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ గోవింద్‌రెడ్డి, హెచ్ఎం నాగిరెడ్డి, ఉపాధ్యాయులు నర్సింలు, సంగమేశ్వర్, కరాటే మాస్టర్ మణికంఠ పాల్గొన్నారు.

◆ **ఘనంగా ఆలయ వార్షికోత్సవం**

సంగారెడ్డి: మండల కేంద్రంలోని చౌట్కూర్‌లో శ్రీ రేణుకాఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవ ఉత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ మఠం భిక్షపతి, మాజీ ఎంపీ బీబీ పాటిల్ తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

◆ **17న విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం**

నారాయణఖేడ్: మండలంలోని చల్లగిద్ద తండాలో ఈనెల 17 నుంచి 19వ తేదీ వరకు భవానీమాత విగ్రహం, శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ తపస్వీ రాంరావు మహారాజ్ పాదుక ప్రతిష్ఠాపన మహోత్సవాలను నిర్వహించనున్నట్లు తండావాసులు తెలిపారు. మూడు రోజుల పాటు వివిధ ఆధ్యాత్మిక, అన్నప్రసాద వితరణ నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఆహ్వానపత్రికను మంగళవారం ప్రముఖులకు నిర్వాహకులు అందజేశారు.

◆ **రికార్డుల తనిఖీ**

ఝరాసంగం(జహీరాబాద్): మండల ప్రజా పరిషత్ వార్షిక ఆదాయ, వ్యయాలను జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ తనిఖీ చేశారు. మంగళవారం ఝరాసంగం మండల పరిషత్ కార్యాలయంలో వివిధ రికార్డులను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సుధాకర్, జూనియర్ అసిస్టెంట్ విజ్ఞాన్, తదితరులు పాల్గొన్నారు.

◆ **ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాలి**

కల్హేర్(నారాయణఖేడ్): రైతులు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాలని ఏఈఓ సంతోష తెలిపారు. మంగళవారం కల్హేర్‌లో ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమం చేపట్టారు. పట్టా పాసుపుస్తకం, ఆధార్ కార్డు అనుసంధానం చేసుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు గుర్తింపు కార్డులు అందజేస్తుందని తెలిపారు. కల్హేర్, మార్డి గ్రామాల రైతులకు అవగాహన కల్పించారు.

◆ **ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన**

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలోని రాపర్తిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ఎంపీడీఓ రమేష్ బాబు మంగళవారం పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి పనుల పురోగతి గురించి తెలుసుకున్నారు. పనుల గురించి మేస్త్రీలకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

◆ **తప్పిపోయిన బాలుడి అప్పగింత**

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని గాంధీనగర్ కాలనీకి చెందిన అనిల్‌కుమార్ (3) అనే బాలుడు సోమవారం సాయంత్రం 7 గంటల సమయంలో సంతలో తప్పిపోయాడు. దీంతో బాలుడి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు చేపట్టిన బొల్లారం సీఐ రవీందర్ రెడ్డి మంగళవారం బాలుడి ఆచూకీ లభించడంతో తండ్రి అనిల్‌కుమార్‌కు అప్పగించారు. సకాలంలో స్పందించి కుమారుడిని క్షేమంగా అప్పగించిన సీఐకి బాలుడి తండ్రి కృతజ్ఞతలు తెలిపారు.

◆ **ఇంటర్ ప్రవేశాలకు స్పాట్ కౌన్సెలింగ్**

జహీరాబాద్ టౌన్: మండల కేంద్రమైన మొగుడంపల్లిలో గల గిరిజన బాలికల గురుకుల కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో స్పాట్ అడ్మిషన్లకు ఈ నెల 16న కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పి.హిమబిందు ఒక ప్రకటనలో తెలిపారు. ఫస్ట్ ఇయర్‌లో ఎంపీసీ, బైపీసీలో ప్రవేశాలకు పదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు హాజరు కావాలన్నారు. ఆసక్తి కలవారు స్టడీ కండక్ట్ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రాలు, 3 పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో 16న ఉదయం 10 గంటలకు హైదరాబాద్‌లోని హయత్‌నగర్‌లో గల బాలుర గురుకుల పాఠశాలకు రావాలని సూచించారు.

◆ **సీబీఎస్ఈ ఫలితాల్లో కేవీ విద్యార్థుల ప్రతిభ**

ఝరాసంగం(జహీరాబాద్): కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) ఫలితాల్లో కేంద్రీయ విద్యాలయ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. మంగళవారం విడుదల చేసిన ఫలితాల్లో పాఠశాలకు చెందిన 27 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా, విద్యార్థులందరూ ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించారు. విద్యార్థిని శ్రీనిధి 600 మార్కులకుగాను 586 మార్కులు సాధించి పాఠశాలలో ప్రథమ స్థానంలో నిలిచింది. విద్యార్థులను విద్యాలయ చైర్మన్, ఝరాసంగం తహసీల్దార్ తిరుమలరావు, ప్రధానోపాధ్యాయులు కేవీడీ పవన్ కుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.

◆ **జగ్గారెడ్డిపై ఆరోపణలు సరికాదు**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఎంపీ ఈటల రాజేందర్ అనుచరులు జగ్గారెడ్డిపై నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని ఇది సరికాదని డీసీసీ ఉపాధ్యక్షుడు అరుణ్ గౌడ్, కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షుడు మధీన్ గౌడ్ అన్నారు. మంగళవారం రామచంద్రాపురం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఎంపీ ఈటల రాజేందర్ చేసిన వ్యాఖ్యలను ఇటీవల ఖండించామని తెలిపారు. అయితే ఈ విషయంలో కొంతమంది ఈటల అనుచరులు జగ్గారెడ్డిపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు. పటాన్‌చెరు పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద బహిరంగ చర్చకు తాము సిద్ధమని, ఎంపీని తీసుకొని రావాలని సవాల్ విసిరారు. ఈ సమావేశంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి చిన్న ముదిరాజ్, నాయకులు శ్రీనివాస్, జగన్, రాంరెడ్డి, మల్లేష్‌లు పాల్గొన్నారు.

◆ **ప్రశాంతంగా పాలీసెట్ పరీక్ష**

జహీరాబాద్ టౌన్: ప్రభుత్వ,ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశానికి మంగళవారం జహీరాబాద్‌లో నిర్వహించిన అర్హత పరీక్ష ప్రశాంతంగా జరిగింది. పట్టణంలోని డిగ్రీ కళాశాల, పస్తాపూర్ ఆర్ఎల్ఆర్ స్కూల్‌లో రెండు పరీక్ష కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు. స్పెషల్ ఆఫీసర్ కుమార స్వామి, సంగమేశ్వర పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సువర్ణలత పరీక్షను పర్యవేక్షించారు. 700 మంది విద్యార్థులకు గాను 650 మంది హాజరయ్యారు. 50 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మండల విద్యాధికారి బస్వరాజ్ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
కె. చంద్రారెడ్డి -9912220353
కె. సంగారెడ్డి -9010294400